ప్రజాశక్తి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి

పకడ్బందీగా కులగణన

అందరూ భాగస్వామ్యం కావాలి : కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కులగణన కార్యక్రమం పకడక్బందీగా నిర్వహించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కలెక్టర్ ఎం.గౌతమి పేర్కొన్నారు. అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో శుక్రవారం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కులగణన- 2023, జిల్లా స్థాయి సదస్సులో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ, జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, రాష్ట్ర రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న, ఎడిసిసి బ్యాంక్ ఛైర్‌పర్సన్ లిఖిత, సిడబ్ల్యూసి ఛైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి, జిల్లా పరిషత్ వైస్ ఛైర్మన్ నాగరత్నమ్మ, ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ మంజుల తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పెద్ద కార్యక్రమం కులగణన కార్యక్రమం అన్నారు. ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేరాల్సిన వారికి చేరాలనే సదుద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. ప్రతి ఒక్క హౌస్ హోల్డ్, వారి కుటుంబం సామాజిక, ఆర్థిక స్థితి, వారి కులవత్తి, వారి విద్యా అర్హత తెలుసుకుని ప్రభుత్వ పథకాలు ఎంతవరకు ఉపయోగించు కోగలుగుతుందన్నారు, నవంబర్ 27వ తేదీ నుంచి వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వచ్చి కులగణణ సర్వే చేస్తారన్నారు. ఈ కార్యక్రమంపై ప్రతి ఒక్కరిలో అవగాహన తీసుకువచ్చేలా అధికారులు కృషి చేయాలన్నారు. జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కులగణన చేపట్టేందుకు అత్యంత సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారన్నారు. స్వాతంత్రం వచ్చాక ఎన్నో ఏళ్ల అనంతరం రాష్ట్ర ప్రభుత్వం కులగణన చేపట్టడం ఎంతో సంతోషకరమైన విషయం అన్నారు. అన్ని సామాజిక వర్గాల నుంచి కులగణన కోసం సూచనలు, సలహాలు అందించాలన్నారు. ఈ సమావేశంలో రిటైర్డ్ జడ్జి కృష్ణప్ప, యాదవ సంఘం ఛైర్మన్ హరీష్ కుమార్, జిల్లా వక్ఫ్ బోర్డు ప్రెసిడెంట్ రిజ్వాన్, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ ఫయాజ్, సిపిఒ అశోక్ కుమార్ రెడ్డి, సోషల్ వెల్ఫేర్ జెడి మధుసూదన్ రావు పాల్గొన్నారు.

నష్టం లెక్కింపులోనూ కోతలే..!

◆ హెక్టారుకే పరిమితం ◆ వేరుశనగ,పత్తికి రూ.17 వేలే సాయం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

కరువు సహాయం నష్టం అంచనాల్లోనే ప్రభుత్వం కోతలు పెడుతోంది. ఈ మేరకు ప్రభుత్వం జీవో నెంబర్:5ను విడుదల చేసింది. దీని ప్రకారం నష్టం అంచనాలు రూపొందించడంలోనే కోతలు పడనున్నాయి. ఇప్పటికే తీవ్రంగా నష్టపోయిన రైతులకు నష్టం అంచనాల్లో కోతలు పడితే పరిహారం ఏ మేరకు వస్తుందన్నది సర్వత్రా ఆందోళన నెలకొంది.

ప్రభుత్వ మార్గదర్శకాలు ఇలా...

ప్రభుత్వమిచ్చిన మార్గదర్శల ప్రకారం చూస్తే రెండు హెక్టార్ల వరకే పరిహారం ఇచ్చేలాగా నిబంధనలు పెట్టారు. అంతకు మించి పంట సాగు చేసిన దానికి పరహారం అందే అవకాశం లేదు. అది కూడా 33 శాతంపైగా పంట నష్టం సంభవించినట్టు భావిస్తేనే పరిహారానికి అధికారులు సిఫారసు చేయాల్సి ఉంటుంది. ఇకపోతే వేరుశనగ, పత్తి పంటలకు హెక్టారుకు రూ.17 వేలు మాత్రమే పరిహారం ఇవ్వాలని నిర్ణయించింది. సాధారణంగా అయితే వేరుశనగ పంట ఒక్క దానికి హెక్టారుకు రూ.60 వేల వరకు ఖర్చు అవుతుంది. కాని ప్రభుత్వం నష్ట పరిహారాన్ని మాత్రం హెక్టారుకు రూ.17 వేలతోనే ఇవ్వాలని నిర్ణయించింది. పత్తి అదే రకంగా హెక్టారుకు రూ.17 వేలతో లెక్కించనున్నారు. ఇక జొన్న, సజ్జ ఆముదం పంటలకు హెక్టారుకు రూ.8500 మాత్రమే నష్టం అంచనా రూపొందించనున్నారు. కంది, అపరాలు, సోయాబిన్, పొద్దుతిరుగుడు పంటలకు హెక్టారుకు రూ.10 వేలు, మొన్న జొన్న పంటకు రూ.12,500 చొప్పున నష్టాన్ని లెక్కించనున్నారు.

నేటి నుంచి లెక్కింపు ప్రారంభం

పంట నష్టం లెక్కింపు నేటి నుంచి ప్రారంభం కానుంది. కరువు మండలాలు ప్రకటించిన 28 మండలాల్లోనూ ఈ లెక్కింపు ప్రారంభం కానుది. ఈ-పంట నమోదలాగానే నష్టం అంచనాను లెక్కింపు

వేస్తారు. ఈ ప్రక్రియ ఈనెల 20వ తేదీ వరకు జరుగుతుందని జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ ఓ ప్రకటనలో తెలిపారు. 21వ తేది నుంచి 25వ తేదీ వరకు సామాజిక తనిఖీ నిమిత్తం ఏదైనా ఫిర్యాదులుంటే స్వీకరిస్తారు. అనంతరం ఈనెల 27వ తేదీన తుది జాబితాను తయారు చేసి జిల్లా వ్యవసాయాధికారికి పంపుతారు. అనంతరం కలెక్టర్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిస్తారు.

ఇప్పటికే పంట నూర్పిడి పూర్తి

ఖరీఫ్ పూర్తయి రబీ కాలం మొదలయ్యాక ప్రభుత్వం పంటనష్టం అంచనా లెక్కింపును ప్రారంభిస్తోంది. ఇందులో ఏ మేరకు నష్టం అంచనాలు పక్కాగా వస్తాయన్న సందేహాలూ సర్వత్రా వ్యక్తమవుతున్నాయి ఎందుకంటే జిల్లాలో ప్రధాన పంట అయిన వేరుశనగ నూర్పిడి దాదాపు పూర్తయింది. వేరుశనగ పంట వేసిన పొలాలు ఖాళీగానున్నాయి. ఈ నేపథ్యంలో ఈ-పంట బుకింగ్ ఏ రకంగా జరుగుతుందన్నది ప్రశ్నార్థకంగానే మారనుంది. కంది, పత్తి తదితర పంటలు వరకు ఉండవచ్చురాని చాలా వరకు పంటలు పూర్తవుతాయి. అనంతపురం జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 9.15 లక్షల ఎకరాలు సాగైంది.2.28 లక్షల ఎకరాల్లో వేరుశనగ సాగైంది. ఈ పంట అక్టోబర్ ఆఖరుకే నూర్పిడి పూర్తయింది. ఇప్పుడు ఈ పంటల నష్టం లెక్కింపు ఏ రకంగా జరుగుతుందన్నది ప్రశ్నార్థకంగా ఉంది.

వేగవంతంగా సెంట్రల్ యూనివర్శిటీ అభివృద్ధి పనులు : కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం సమీపంలోని సెంట్రల్ యూనివర్సిటీలో అభివృద్ధి పనులు వేగవంతంగా చేపడుతున్నట్లు కలెక్టర్ ఎం.గౌతమి తెలిపారు. విజయవాడ ఏపీ సెక్రటేరియట్‌లోని సిఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి శుక్రవారం వివిధ విద్యా సంస్థలు, ప్రాజెక్టుల్లో మౌలిక సదుపాయాలు తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కెఎస్.జవహర్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. అనంతపురం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్‌తో పాటు వివిధ శాఖల అధికారులు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ యూనివర్శిటీలో వేగవంతంగా అభివద్ధి పనులు చేపడుతున్నామని వివరించారు. సెంట్రల్ యూనివర్సిటీలో ఇరిగేషన్ ఛానల్ ఏర్పాటుకు సంబంధించి నెలకొన్న సమస్యను పరిష్కరించామన్నారు. ప్రహరీ నిర్మాణ పనులను మొదలుపెట్టామన్నారు. యూనివర్సిటీకి విద్యుత్ సరఫరా చేసేందుకు 33 కెవి సబ్ స్టేషన్‌ను మంజూరు చేయనున్నట్లు చెప్పారు. యూనివర్సిటీలో భవన నిర్మాణ పనులు కొనసాగుతున్నాయన్నాని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో గ్రంధి వెంకటేష్, సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ హనుమాన్ కెనడి, సెంట్రల్ యూనివర్సిటీ డీన్ ప్రొఫెసర్ జి.రామిరెడ్డి, ఏపీఎస్పీడీసీఎల్ సిఎండి సంతోష్ రావు, పీఆర్ ఎస్ఈ భాగ్యరాజ్, ఏపీఎస్పీడీసిఎల్ ఎస్ఈ సురేంద్ర, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఇషాన్ బాషా పాల్గొన్నారు.

జెఎన్‌టియులో సాంస్కృతిక సంబరం

◆ ప్రారంభించిన విసి రంగజనార్ధన ◆ ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శనలు

సాంస్కృతిక ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి -అనంతపురం

అనంతపురం జెఎన్‌టియులో సాంస్కృతిక సంబరం శుక్రవారం నాడు అట్టహాసంగా ప్రారంభం అయ్యింది. ఆర్ట్స్, కల్చరల్ ఫెస్ట్-2023(ఉత్సవ్) పేరుతో నిర్వహిస్తున్న ఈకార్యక్రమాన్ని విసి రంగజనార్ధన ప్రారంభించారు.

సాంస్కృతిక ఉత్సవాలను ప్రారంభం కార్యక్రమంలో మాట్లాడుతున్న జెఎన్‌టియు విసి రంగజనార్ధన

ఎన్‌టిఆర్ ఆడిటోరియంలో రెండు రోజుల పాటు ఈ కార్యక్రమం జరగనుంది. విద్యార్థులు డ్యాన్సులు, పాటలు, మిమిక్రీ, ప్యాషన్‌షో, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. విద్యార్థుల ప్రదర్శనలను ఆహుతలను కట్టిపడేశాయి. జెఎన్‌టియు పులివెందుల ఇంజినీరింగ్ కళాశాల, జెఎన్‌టియు కలికిరి ఇంజినీరింగ్ కళాశాల, ఎంబీఏ విభాగం, ఓటీపీఆర్ఐ కళాశాలల నుంచి 550 మంది విద్యార్థులు ఈ ప్రదర్శనలో పాల్గొననున్నారు.

సరికొత్త ఆలోచనలకు నాందిపలకాలి

జెఎన్‌టియు విసి రంగజనార్ధన

విద్యార్థులు కొత్త కొత్త ఆలోచనలు, ఆవిష్కరణలకు నాంది పలకాలని విసి రంగజనార్ధన్ పిలుపునిచ్చారు. విద్యార్థులు వారికి ఇష్టమైన రంగాన్ని ఎంచుకుని జీవితంలో స్థిరపడాలని సూచించారు.ఇ రిజిస్ట్రార్ సి.శశిధర్ మాట్లాడుతూ విద్యార్థులు పోటీ తత్వం కలిగి ఉండాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ విద్యార్థులు పాల్గొని వారిలో ఉన్న నైపుణ్యతను చాటాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్‌వి.సత్యనారాయణ, కన్వీనర్ డాక్టర్ జి.మమత, కో కన్వీనర్లు డాక్టర్ ఎం.అంకారావు, డాక్టర్ అరుణ, వైస్ ప్రిన్సిపాల్ ఇ.అరుణ కాంతి, యూనివర్సిటీ డైరెక్టర్లు ఇ.కేశవ రెడ్డి, పి.సుజాత, ఆర్.కిరణ్మయి, పద్మ సువర్ణ, విబి.చిత్ర పాల్గొన్నారు.

జనావాసాల మధ్య సెల్‌టవర్ నిర్మాణం ఆపాలి

కలెక్టర్ ఎం.గౌతమికి ఐద్వా నాయకుల వినతి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

నగరంలోని విద్యారణ్యనగర్‌లో జనావాసాల మధ్య సెల్‌టవర్ నిర్మాణాన్ని వెంటనే ఆపాలని ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి డిమాండ్ చేశారు. శుక్రవారం ఐద్వా ఆధ్వర్యంలో విద్యారణ్య నగర్‌కు చెందిన మహిళలతో కలిసి కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్ ఎం.గౌతమిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సావిత్రి మాట్లాడుతూ ఏ.నారాయణపురం పంచాయతీ సచివాలయం.5 పరిధిలోని విద్యారణ్య నగర్‌లో ఎల్.11/ బి.6 విద్యుత్ స్తంభం పక్కన టి.కేశవరెడ్డికి చెందిన భవనంపై ఓ ప్రయివేట్ కంపెనీ సెల్ టవర్ నిర్మాణం జరుగుతోందన్నారు. ఈ ప్రాంతంలో అత్యధికంగా వడ్డెర, దినసరి బెల్దారి, ఆటో తదితర రంగాలపై ఆధారపడి జీవిస్తున్న వారు ఉన్నారన్నారు. అలాంటి చోట ఎవరితో సంప్రదించకుండా ఏకపక్షంగా సెల్ టవర్ నిర్మాణం చేయడం సరి కాదన్నారు. సెల్ టవర్ నిర్మాణం జరిగితే రేడియేషన్ వ్యాప్తి వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. టవర్ నిర్మాణం వల్ల భవన యజమానికి వచ్చే నగదు తప్ప కాలనీ ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. తక్షణమే సెల్ టవర్ నిర్మాణం నిలిపివేయాలని కోరారు. జనావాసం లేని ప్రాంతంలో నిర్మించుకుంటే ఎవరికీ అభ్యంతరం ఉండదన్నారు. ఇందుకు స్పందించిన కలెక్టర్ గౌతమి సంబంధిత అధికారులతో మాట్లాడి సెల్ టవర్ నిర్మాణాన్ని నిలిపివేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు యశోదమ్మ, పద్మ, పర్వీన్, కళావతి, లక్ష్మీదేవి, యశోదమ్మ, వరలక్ష్మి, గంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఐద్వా నాయకురాళ్లు

పంచాయతీ కార్మికుల భిక్షాటన

వేతనాల కోసం తిప్పలు - కొనసాగుతున్న నిరసనలు

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

పంచాయతీ పారిశుధ్య కార్మికుల పరిస్థితి దయనీయంగా మారింది. నాలుగు నెలలుగా ప్రభుత్వం వేతనాలు ఇవ్వకపోవడంతో కుటుంబాన్ని పోషించుకోవడం కష్టంగా మారడంతో చేసేది లేక భిక్షమెత్తారు. అయినా అటు ప్రభుత్వానికిగానీ, ఇటు అధికారులకుగానీ వేతనాలు చెల్లిద్దామన్న ఆలోచన రాకపోవడం బాధాకరమని కార్మికులు వాపోతున్నారు. మండలంలోని గన్నెవారిపల్లి పంచాయతీలో పని చేస్తున్న 40 మంది పంచాయతీ పారిశుధ్య కార్మికులు వేతనాలు చెల్లించాలని సిఐటియు ఆధ్వర్యంలో గత కొన్ని రోజులుగా ఆందోళనలు చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా శుక్రవారం పంచాయతీ పరిధిలోని కడప రోడ్డులో దుకాణాల వద్ద భిక్షమెత్తి తమ గోడు వెల్లబోసుకున్నారు. ఈ సందర్భంగా వారు కార్మికులు మాట్లాడుతూ నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో కుటుంబాలు పస్తులు ఉంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అయినప్పటికీ కొన్ని నెలలుగా అప్పులు చేసి కుటుంబాలు పోషించుకున్నామన్నారు. ప్రస్తుతం అప్పులు ఇచ్చే వారు కూడా ఉన్నారన్నారు. చేసేది లేక భిక్షమెత్తుకోవాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి వెంటనే వేతనాలు చెల్లించాలని, లేనిపక్షంలో ఆత్మహత్యలు చేసుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి, హనుమంతురెడ్డి, రామంజి, పంచాయితీ కార్మికులు రాజు, రామకృష్ణ, సంధ్యాబాయి, కుళ్లాయప్ప, అచ్చమ్మభాయి పాల్గొన్నారు.

భిక్షాటన చేస్తున్న కార్మికులు, సిఐటియు నాయకులు

బిసిలను దగా చేసిన వైసిపి

రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాష్ట్రంలో బిసిల సంక్షేమం, అభివృద్ధికి పాతరేస్తూ వైసిపి ప్రభుత్వం తీరని ద్రోహం చేసిందని టిడిపి అనంతపురం పార్లమెంట్ అధ్యక్షులు కాలవశ్రీనివాసులు, పొలిట్‌బ్యూరో సభ్యులు బిటి.నాయుడు అన్నారు. శుక్రవారం టిడిపి ఆధ్వర్యంలో నగరంలోని ఎన్టీఆర్ మార్గ్ సమీపంలో ఉన్న షిరిడీ సాయిబాబా కళ్యాణ మండపంలో బిసిల హక్కులపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగున్నరేళ్ల వైసిపి పాలనలో బిసిల సంక్షేమం, అభివృద్ధి కుంటుపడిందన్నారు. పరిపాలనలో బిసిలను భాగస్వాములను చేయలేదన్నారు. ఇచ్చిన పదవులు పదవి అలంకరణలకే పరిమితం చేశారని, వారి స్వేచ్ఛను కూడా హరించిందన్నారు. రాష్ట్రంలో నలుగురు రెడ్లు ఏం చెబితే అదే వైసిపిలోనూ, ప్రభుత్వంలోనూ ఆదేశాలను సిరాసవహిస్తు పరిపాలన సాగిస్తున్నారని విమర్శించారు. బిసిలకు ప్రాధాన్యత లేకుండా

మాట్లాడుతున్న మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు

పోయిందన్నారు. రాష్ట్రంలో సాగుతున్న నరహంతక, విధ్వంస, అరాచక, ద్రోహపూరిత పరిపాలను అంతమొందించేందుకు బిసిలంతా ఐక్యమవుతున్నా రని తెలిపారు. రాబోవు ఎన్నికల్లో బిసిల ఆగ్రహానికి వైసిపి ప్రభుత్వం గురికాక తప్పదన్నారు. టిడిపి రాష్ట్ర నాయకులు బిటి.నాయుడు మాట్లాడుతూ సమావేశంలో బిసిలంతా కలిసి 12 డిమాండ్లను ఏకగ్రీవంగా తీర్మాణం చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడ్, జెడ్పీ మాజీ ఛైర్మన్ పూల నాగరాజు, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.జగదీష్, టిడిపి బిసి సెల్ జిల్లా అధ్యక్షులు ఆవుల క్రిష్ణయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మి నరసింహులు, టిడిపి రాష్ట్ర నాయకులు ఆదినారాయణ, శివబాల, జనసేన జిల్లా ఉపాధ్యక్షులు ఈశ్వరయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర, టిడిపి రాష్ట్ర నాయకులు దేవళ్లమురళి, చంద్రశేఖర్‌యాదవ్, పద్మశాలివాహన సంఘం నేత జింకా సూర్యనారాయణ, కుమ్మర సంఘం రాష్ట్ర నాయకులు పోతులయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతాంగానికి తోడుగా ఉందాం

జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రభుత్వం అందిస్తున్న సాయాన్ని రైతులకు అందించి వారికి అన్ని విధాలా అండగా ఉండేలా అధికారులు కృషి చేయాలని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ తెలిపారు. అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో జిల్లా స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెడ్పీ ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రస్తుతం నెలకొన్న కరువు పరిస్థితుల నేపథ్యంలో రైతులను అన్ని విధాలా ఆదుకోనేలా రైతులకు అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే సాయాన్ని రైతులకు అందించేలా అధికారులు కృషి చేయాలని కోరారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ కరువు పరిస్థితుల నేపథ్యంలో ఎక్కువ నీరు అవసరమయ్యే వరి, మొక్కజొన్న తదితర పంటలు రైతులు సాగు చేయరాదన్నారు. తక్కువ నీటిని వినియోగించే పంటలను సాగు చేసి నీటిని పొదుపు చేయాలన్నారు. హెచ్ఎల్సీ కెనాల్ నీరు ఆగిపోయిన నేపథ్యంలో రిజర్వాయర్లలో నీటి లభ్యత తక్కువగా ఉందని, ప్రస్తుత పరిస్థితుల్లో సాగునీటికి నీటిని విడుదల చేయడం సాధ్యంకాని పరిస్థితులు ఉన్నాయన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ మాట్లాడుతూ ఈనెల 20వ తేదీ వరకు వ్యవసాయ, రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో క్షేత్ర స్థాయిలో పంట నష్టం అంచనా వివరాలను సేకరించనున్నట్లు చెప్పారు. ఈనెల 26, 27వ తేదీల్లో క్షేత్ర స్థాయిలో పరిశీలించి తుది జాబితాను తయారు చేసి వ్యవసాయ కార్యాలయానికి పంపుతామన్నారు. జాబితాను కలెక్టర్ అనుమతితో పంట నష్ట పరిహారం కోసం రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపుతామన్నారు. ఈ సమావేశంలో సిపిఒ అశోక్ కుమార్ రెడ్డి, ఉద్యాన శాఖ డిడి రఘునాథరెడ్డి, ఏపీఎమ్ఐపి పీడీ ఫిరోజ్ ఖాన్, హెచ్ఎల్సీ ఎస్ఈ రాజశేఖర్, హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఈ దేశేనాయక్, ఎల్డీఎం సత్యరాజ్, డ్వామా పీడీ వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైస్ ఎంపిపి ఎన్నిక వాయిదా

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

మండలంలోని వైఎస్ ఎంపిపి పదవికి జరుగుతున్న ఎన్నిక రెండవ రోజూ వాయిదా పడినట్టు స్పెషల్ ఆఫీసరు ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మండల పరిషత్ అధ్యక్షులుగానున్న రామ్మూర్తి స్థానంలో వైఎస్ ఎంపిపిగానున్న జివి.రామిరెడ్డిని ఇటీవల మండల పరిషత్ అధ్యక్షులుగా ఎన్నిక అయ్యారు. ఖాళీ అయిన వైఎస్ ఎంపిపి స్థానానికి ఎన్నిక జరగాల్సి ఉంది. ఈ మేరకు గురువారం నాడు ఎన్నికను మండల పరిషత్ కార్యాలయంలోని సర్వసభ్య సమావేశంలో నిర్వహించారు. 12 మంది సభ్యుల్లో ఇద్దరు మాత్రమే ఎన్ని కార్యక్రమానికి వచ్చారు. దీంత కోరం లేక మొదటి రోజు వాయిదా పడింది. రెండో రోజు అదే పరిస్థితి ఉండటంతో మరోమారు వాయిదా పడింది. కలెక్టర్ అనుమతి తీసుకుని మరోమారు ఎన్నికను నిర్వహిస్తామని స్పెషల్ ఆఫీసర్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

అర్థాకలితో అలమటిస్తున్నా పట్టించుకోరా..

వెళ్లాలనుకుంటే రాజీనామా చెయ్.. బెదిరించకు..

ఎస్‌ఓపై సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి-శింగనమల

విద్యార్థినులు అర్ధాకలితో అలమటిస్తున్నా పట్టించుకోరా అంటూ సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల ఎస్ఓపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం మధ్యాహ్నం మండల కేంద్రంలోని కెజిబివిని సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా రికార్డులు సరిగా లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. అనంతరం భోజనాన్ని తనిఖీ చేసి నాణ్యతగా లేకపోవడంతో ఈ భోజనాన్ని విద్యార్థినులు ఎలా తింటారని ఎస్ఓను ప్రశ్నించారు. అయితే రెగ్యులర్ వర్కర్లు రాలేదని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. తర్వాత ఆర్ఓ వాటర్‌ప్లాంట్‌ను పరిశీలించగా పని చేయకపోవడంతో ఎందుకు పనిచేయలేదని ప్రశ్నించారు. అదేవిధంగా స్టోర్ రూమ్‌ను పరిశీలించగా కూరగాయలు నాణ్యతగా లేకపోవడంతో ఎస్ఓను మందలించారు. దీంతో ఎస్ఓ స్పందిస్తూ ఇక్కడ సిబ్బంది సమస్య ఉందని, తానే ఉద్యోగానికి రాజీనామా చేయాలని అనుకుంటున్నానని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో.. 'నువ్వు రాజీనామా చేయాలనుకుంటే చెయ్.. ఎందుకు నన్ను బ్లాక్ మెయిల్ చేస్తున్నావ్..' అంటూ మండిపడ్డారు. అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించి పలు సూచనలు, సలహాలను ఇచ్చారు. మళ్లీ నెల తర్వాత వస్తానని, అప్పటిలోపు లోపాలు సరిదిద్దుకోవాలని ఎస్ఓను ఆదేశించారు. అరకొరగా అన్నం పెట్టడంతోపాటు ఎవరైనా నిలదీస్తే టిసి ఇచ్చి పంపుతానని బెదిరింపులకు గురి చేయడం మంచిది కాదన్నారు. అనంతరం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంలో సమయం అవుతున్నా విద్యార్థులు తరగతి గదుల బయట తిరుగుతుండడాన్ని గమనించి విద్యార్థులను పిలిచి ఎందుకు బయట ఉన్నారని ప్రశ్నించడంతో టీచర్ సెలవు పెట్టిందని సమాదాణం ఇచ్చారు. దీంతో హాజరు పట్టికను పరిశీలించి ఎక్కువ మంది సెలవులో ఉండడాన్ని గమనించి అందరికీ ఒకేసారి లీవులు ఎలా ఇస్తారని అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అనంతరం విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఆయన వెంట ఎఎంఓ చంద్రశేఖర్‌రెడ్డి, సీఎమ్ఓ వేణుగోపాల్, ఎంఈఓ నరసింహారాజు పాల్గొన్నారు.

కెజిబివి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు

పూర్వ విద్యార్థులే కళాశాల అభివృద్ధికి బలం

జెఎన్‌టియు విసి రంగాజనార్దన

ప్రజాశక్తి-అనంతపురం

పూర్వ విద్యార్థులే జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల అభివృద్ధికి బలం అని విసి రంగాజనార్దన అన్నారు. శుక్రవారం స్థానిక జెఎన్‌టియులోని ఎన్టీఆర్ ఆడిటోరియంలో 1963–68లో ఇంజినీరింగ్ పూర్తి చేసిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొనడం తన అదృష్టమన్నారు. మీ అనుభవాలు, సలహాలు, సూచనలు ఎప్పటికీ మరువలేనివన్నారు. అనంతరం పూర్వవిద్యార్థులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ సి.శశిధర్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్వీ.సత్యనారాయణ, పూర్వ విద్యార్థులు సిఎస్ఆర్.మూర్తి, చిరంజీవి, ఎ.ఆర్.రమేష్, శ్రీనివాసన్, ఎస్.కోటేశ్వరరావు, కె.వి.సుబ్రమణ్యం, సత్యనారాయణ, వి.శంకర్, ఎం.ఎస్.గిరిప్రసాద్, యూనివర్సిటీ డైరెక్టర్లు అల్యూమిని డైరెక్టర్ పి.సుజాత, ఇ.కేశవరెడ్డి, ఆర్.కిరణ్మయి, పద్మసువర్ణ, వి.బి.చిత్ర, బి.ఈశ్వర్‌రెడ్డి, ఎ.సురేష్‌బాబు, సి.శోభాబిందు, జి.వి.సుబ్బారెడ్డి, ఎ.పి.శివకుమార్, వైస్ ప్రిన్సిపల్ ఇ.అరుణకాంతి, హెచ్.సుదర్శనరావు, భవన విజయ, విభాగ అధిపతులు ఎస్.చంద్రమోహన్‌రెడ్డి, ఎం.రామశేఖరరెడ్డి, కెవిఫ్.భారతి, కళ్యాణి రాధా, దిలీప్‌కుమార్, అజిత, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలు నాటుతున్న విసి రంగాజనార్దన

ఏ మొహం పెట్టుకుని ప్రజల్లోకి వస్తున్నారు..

మాజీమంత్రి 'కాలవ'పై విప్ కాపు ఫైర్

ప్రజాశక్తి-రాయదుర్గం

2014 ఎన్నికల మేనిఫెస్టోలో చేసిన వాగ్దానాలు అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరించి ఘోరంగా దెబ్బతిన్న టిడిపి నాయకులు ఇప్పుడు ఏ మొహం పెట్టుకుని ప్రజల్లోకి వస్తున్నారని విప్ కాపు రామచంద్రారెడ్డి నిలదీశారు. శుక్రవారం పట్టణంలోని రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో చేసిన అనేక వాగ్దానాలను అమలు చేయలేని టిడిపి నాయకులు రాబోయే ఎన్నికల్లో సూపర్ సిక్స్ పేరిట 'బాబు షూరిటీ, భవిష్యత్తుకు గ్యారంటీ' పేరుతో ప్రజల్లోకి రావడం హాస్యాస్పదం అన్నారు. టిడిపి అధినేత చంద్రబాబు, మాజీమంత్రి కాలవ శ్రీనివాసులను ఎందుకు నమ్మాలో చెప్పి ప్రజల్లోకి వెళ్లే భాగంగుండాలని సూచించారు. 2014 ఎన్నికల మేనిఫెస్టోలో టిడిపి ద్వారా రుణ మాఫీ చేస్తామని, రూ.లక్ష వడ్డీ లేని రుణం ఇస్తామని మాట ఇచ్చి చేశారా లేదా.. అన్నారు. అది చాలదన్నట్టు ఇప్పుడు ఎన్నికలు రావడంతో మహాశక్తి పేరిట పేద మార్పు చేస్తామని మహిళలను మోసం చేసేందుకు వస్తున్నారన్నారు. గతంలో దీపం పథకం కింద ఏడాదికి 12 సిలిండర్లు ఇస్తామని చెప్పి ఇవ్వకపోగా.. ప్రస్తుతం ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితం అని చెబుతున్నారన్నారు. అలాగే ఇంటికో ఉద్యోగం.. ఇవ్వకపోతే రూ.2వేల భృతి ఇస్తామని, రైతు రుణమాఫీ వెళ్లే తొలి సంతకం అని ప్రగల్భాలు పలికి అధికారంలోకి వచ్చాక ఏం చేశారో ప్రజలకు తెలుసు అన్నారు. ఇక కాలవ శ్రీనివాసులు సొంత కులస్తులనే రాజకీయంగా ఎదగనివ్వని గొప్ప వ్యక్తి అని ఎద్దేవా చేశారు.

మాట్లాడుతున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

పంటలు పూర్తయ్యే వరకూ నీరివ్వాలి

సహకార పరపతి సొసైటీ మాజీ ప్రెసిడెంట్ పల్లె జయరామిరెడ్డి

ప్రజాశక్తి-నార్పల

హెచ్ఎల్‌సి కెనాల్ కింద సాగు చేసిన పంటలు పూర్తయ్యే వరకు నీరు విడుదల చేయాలని సహకార పరపతి సంఘం మాజీ ప్రెసిడెంట్ పల్లె జయరామిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మండల వ్యాప్తంగా హెచ్ఎల్‌సి కింద సుమారు 5వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగుచేసున్నారన్నారు. ఏడాది ఆగస్టులోనే తుంగభద్ర కాలువలకు నీటిని వదిలేవారన్నారు. అయితే ఈసారి నవంబర్ వచ్చినప్పటికీ నీరు వదలలేదన్నారు. దీంతో అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి పంట సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ఆర్థికంగానూ మండల రైతుల పొలాలకు వెళ్లే ఆరు తూములను బలవంతంగా బంద్ చేయించి తమ కళ్ల ముందే ఇతర ప్రాంతాలకు నీళ్లు తరలిస్తున్నా ఏమీ చేయలేని స్థితికిరైతులు చేరుకున్నారన్నారు. ఈ సమయంలో నీరు విడుదల చేయకపోవడంతో రైతులు అప్పులు తీర్చలేక ఆత్మహత్యలు చేసుకోవాల్సి వస్తుందన్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి మండల రైతుల దుస్థితిని గమనించి హెచ్ఎల్‌సి ఆరు తూములకు వెంటనే ఎత్తి కాలువలకు నీరు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఉత్తమ ఆర్గానిక్ రైతుగా గోపాల్‌గుప్తా

ప్రజాశక్తి-గుత్తి

జాతీయ ఉత్తమ ఆర్గానిక్ రైతుగా గుత్తికి చెందిన ఇకిలల గోపాల్‌గుప్తా ఎంపికయ్యారు. పట్టణానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారవేత్త ఇకిలల గోపాల్‌గుప్తా వ్యాపారవేత్తగా కొనసాగుతూనేపాటు కొడికొండ గ్రామపంచాయతీ పరిధిలో పదెకరాల పొలంలో ఎలాంటి రసాయనిక ఎరువులు వాడకుండా సేంద్రియ ఎరువులతో పంటలు సాగు చేస్తున్నారు. ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం ఇవ్వేందుకు వేరుసెనగ, కంది, టమోటా, మిర్చి తదితర పంటలను పండిస్తూ సామాజిక సేవలో తన వంతు పాత్రను పోషిస్తున్నారు. న్యాయ సేవ రంగంలో విశిష్ట సేవలు అందించిన అనంతపురం జిల్లా మాజీ న్యాయమూర్తి కిష్టప్ప రచించిన పేదల న్యాయమూర్తి కృష్ణ అనే పుస్తకావిష్కరణ కార్యక్రమంలో భాగంగా సమాజంలో వివిధ రంగాల్లో సేవలందించిన పలువురిని న్యూఢిల్లీకి చెందిన లీగల్ సర్వీసెస్ రైట్ ప్రొటెక్షన్ సంస్థ ఆధ్వర్యంలో సన్మానం చేయనుంది. అందులో భాగంగా గోపాల గుప్తాను న్యూఢిల్లీలోని ఆంధ్ర భవన్లో ఈనెల 26న సన్మానం చేయనున్నారు. ఈ మేరకు ఆయనకు నిర్వాహకులు శుక్రవారం ఆహ్వానపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమానికి బీసీ సంక్షేమ సంఘం జాతీయ నాయకులు, పార్లమెంట్ సభ్యులు ఆర్.కృష్ణయ్య, ఐపిఎస్ అధికారి ఆగర్వాల్‌తో పాటు పలువురు జాతీయ స్థాయి ప్రముఖులు పాల్గొన్నట్లు తెలిపారు. జాతీయస్థాయి ఉత్తమ ఆర్గానిక్ రైతుగా గోపాల్ గుప్తా ఎంపిక పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

ప్రజాశక్తి-ఉరవకొండ

మండలంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను వ్యవసాయ అధికారి శుభకర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా రికార్డులను పరిశీలించి ఆయాన్, ఎస్‌టిఎంఎం ఫర్టిలైజర్స్ దుకాణాల్లో సరైన పత్రాలు లేకపోవడంతో రూ.65,400 విలువజేసే వివిధ రకాల మందులను నిలుపుదల చేసి నోటీస్ ఇచ్చారు. తర్వాత న్యూ రైతు డిపో, హనుమన్ అగ్రో ఏజెన్సీస్ దుకాణాలను తనిఖీ రికార్డులను పరిశీలించారు. అలాగే విడపనకల్ మండల కేంద్రంతోపాటు పొలికి, గడేకల్, పెంచలపాడు గ్రామాల్లో ఉన్న ఫర్టిలైజర్ దుకాణాలను విడపనకల్లు మండలం వ్యవసాయాధికారి పెన్నయ్య ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాసిరకం విత్తనాలు, ఎరువులను అమ్మి రైతులను మోసం చేస్తే ఆయా దుకాణాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విఎఎలు విజయ్‌కుమార్, రమేష్, అశోక్, ఎంపిఇఒ ముత్యాలు, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఎఒ శుభకర్

తూతూమంత్రంగా గార్లదిన్నె సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-గార్లదిన్నె

గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు మూడు నెలలకు ఒకసారి నిర్వహించే మండల స్థాయి సర్వసభ్య సమావేశం శుక్రవారం తూతూమంత్రంగా ముగించారు. దీంతో ఆయా సమస్యల పరిష్కారానికి మార్గాలే లేకుండా పోయాయని మండల వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనులు పెట్టకపోవడంతో కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికితోడు ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతుండటంతో పంటలు ఎండిపోతున్నాయి. అలాగే పాఠశాలల్లో నాడు–నేడు పనులు జరుగుతున్నా మండల విద్యాధికారి అటువైపు చూడలేదు. కల్లూరు గ్రామంలో పేదలు వేసుకున్న గుడిసెలను ఎలాంటి ముందస్తు హెచ్చరికలు లేకుండా కూల్చివేశారు. దీంతో పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆయా సమస్యలపై చర్చించే అవకాశం లేకపోవడంతో పేదలు ఉసూరుమంటున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి వెంకటనారాయణ, తహశీల్దార్ ఉషారాణి, ఎంపిడిఒ విజయభాస్కర్, వైసిపి రామ్మోహన్‌రెడ్డి, ఇఒఆర్‌డి వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సమావేశానికి హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు

మాతా, శిశు మరణాలను నియంత్రించాలి

జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిణి దేవి

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లాలో మాతా, శిశు మరణాలను తగ్గించేందుకు కృషి చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ ఇబి.దేవి సూచించారు. జిల్లాలో జరిగిన రెండు మాతా మరణాలు, ఆరు శిశు మరణాలకు కారణాలను తెలుసుకునేందుకు శుక్రవారం స్థానిక కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏదైనా ఆసుపత్రిలో మాతా, శిశు మరణాలు జరిగినప్పుడు కారణాలు తెలుసుకుని మరోసారి ఏ ఆసుపత్రిలో జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి గర్భిణీని 12 వారాల్లోపు రిజిస్ట్రర్ చేసుకుని అన్నిరకాల వైద్య పరీక్షలు చేయాలన్నారు. ఏ తల్లీ ప్రసవం అనంతరం అధిక రక్తస్రావంతో మరణించకూడదన్నారు. ముఖ్యంగా గర్భిణులు తీసుకోవాల్సిన ఆహారం, జాగ్రత్తలను వివరిస్తూ ఉండాలన్నారు. అలాగే ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నెలకు కనీసం 10 కాన్పులు చేయాలన్నారు. మదర్ అండ్ చైల్డ్ హెల్త్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ యుగంధర్ మాట్లాడుతూ రక్తహీనత ఉన్నా, గుండె సంబంధిత సమస్యలు ఉన్నా, తక్కువ ఎత్తు, కాన్పుకూ కాన్పుకు ఎక్కువ సమయం ఉన్నా, తల్లి గర్భంలో ఉమ్మ నీరు తక్కువ ఉన్నా, బిడ్డ పెరుగుదల లేకపోయినా, హైరిస్క్ గర్భిణులను గుర్తించి ప్రత్యేక వైద్యసేవలు అందించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా ఆసుపత్రుల కో–ఆర్డినేటర్ పాల్ రవికుమార్, ప్రభుత్వ ఆసుపత్రి చిన్నపిల్లల వైద్యులు శంకర్‌నారాయణ, విజయ్‌కుమార్, ఎంపిహెచ్ఇఒ లక్ష్మన్న, ఎంపిహెచ్ఎస్ హేమలత, సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిణి దేవి

హమాలీలకు దసరా బోనస్ చెల్లించాలి

జెసి కేతన్‌గార్గ్‌కు సిఐటియు నాయకుల వినతి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సివిల్ సప్లయ్ హమాలీలకు దసరా బోనస్, అక్టోబర్ కూలి చెల్లించాలని సివిల్ సప్లయ్ హమాలీ యూనియన్ గౌరవాధ్యక్షులు ఆర్‌వి.నాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం సిఐటియు ఆధ్వర్యంలో జిల్లా జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 12 స్టాక్ పాయింట్‌లలో 350 మంది హమాలీలు పని చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో నెలక్రితమే దసరా బోనస్ చెల్లించేశారని తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లాలో కూడా నెల రోజుల క్రితమే దసరా బోనస్ చెల్లించేశారని గుర్తు చేశారు. అనంతపురం జిల్లాలో మాత్రం హమాలీలు అధికారుల చుట్టు ప్రదక్షిణలు చేస్తున్న బోనస్ ఇవ్వలేదన్నారు. పైగా నెల వేతనం కూడా చెల్లించలేదన్నారు. 100 హమాలీలకు సంబంధించి పిఎఫ్‌లో పేర్లు నమోదు కాలేదన్నారు. స్టాక్ పాయింట్లలో తాగునీటి సౌకర్యం కల్పించడం లేదన్నారు. సివిల్ సప్లయ్ హమాలీలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు స్పందించిన జెసి కేతన్‌గార్గ్ వారంరోజుల్లోగా సదరా బోనస్, అక్టోబర్ నెల వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయ్ హమాలీ యూనియన్ కార్యదర్శి డి.నారాయణస్వామి, కోశాధికారి సుభాన్ మేస్త్రీలు సి.నారాయణస్వామి, రాందాసు, ముని తదితరులు పాల్గొన్నారు.

మంచి మార్కులతో విద్యార్థులను ప్రమోట్ చేయాలి

సమగ్ర శిక్ష రాష్ట్ర పీడీ శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

మంచి మార్కులతో విద్యార్థులను పై తరగతులకు ప్రమోట్ చేయాలని సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు సూచించారు. శుక్రవారం నగర శివారు వడియం పేట వద్ద ఉన్న వైవి శివారెడ్డి కళాశాలలో నిర్వహిస్తున్న కేజీబీవీ నూతన ఉద్యోగుల శిక్షణ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేజీబీవీల్లో చదువుతున్న విద్యార్థినులకు మంచి విద్యాబోధన చేసి ఉన్నత స్థానానికి తీసుకెళ్లాలన్నారు. అలాగే విద్యార్థులకు క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించాలన్నారు. దివ్యాంగుల విద్యార్థులకు కేజీబీవీలో వచ్చే ఏడాది నుంచి ప్రవేశాలు కల్పించి ప్రత్యేక టీచర్లను ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం శిక్షణ కేంద్రంలో సౌకర్యాలను పరిశీలించి జిసిడిఒ మహేశ్వరిని అభినందించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ విభాగం జాయిన్ డైరెక్టర్ గీత, ఏఎంఒ చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్టీటీ ఐఇడి కోఆర్డినేటర్ రామ్‌కమల్, సమగ్ర శిక్ష రాష్ట్ర అబ్జర్వర్లు మహేశ్వర్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, ప్రసాద్, సోనాలి, అబ్రహం, అసిస్టెంట్ సెక్టోరియల్స్ గోపాల్ కృష్ణ, చంద్రమోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు

నారాలోకేష్‌తో సుధాకర్ నాయుడు నాయకులు కుటుంబం

నారా లోకేష్‌ను కలిసిన సుధాకర్‌నాయుడు దంపతులు

అనంతపురం కలెక్టరేట్ : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను జిల్లాకు చెందిన టిడిపి సీనియర్ నాయకులు సుధాకర్‌నాయుడు దంపతులు శుక్రవారం హైదరాబాద్‌లోని నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సామాజిక వర్గాల ప్రాతిపదికన టికెట్లు కేటాయిస్తే అనంతపురం అర్బన్ రేసులో సుధాకర్‌నాయుడు సతీమణి నిలిచే అవకాశాలు ఉన్నట్లు పలువురు భావిస్తున్నారు. లోకేష్‌ను కలిసిన వారిలో సుధాకర్‌నాయుడు భార్య బలిజ భావన, కుమారుడు ఉన్నారు.

వివాహానికి ఆర్థికసాయం

శింగనమల : మండలంలోని తరిమెల గ్రామానికి చెందిన తప్పెట సమ్మెట్ల అశ్వర్థమ్మ, సుంకన్న కుమార్తె కుళ్లాయమ్మ వివాహానికి తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బిసిసెల్ అధ్యక్షులు బెస్త నారాయణస్వామి, బెస్త సాధికర కమిటీ అనంతపురం పార్లమెంట్ అధ్యక్షులు అమర్‌నాథ్, తరిమెల గ్రామ కమిటీ అధ్యక్షులు కుమార్, గొరక శీన, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ ఎంపిపికి సన్మానం

ఉరవకొండ : నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఉరవకొండ ఎంపిపి వెలుగొండ నరసింహులును విడపనకల్లు ఎంపిపి కరణం పుష్పావతి భీమిరెడ్డి శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఎంపిపిని సన్మానించిన వారిలో వైసిపి సీనియర్ నాయకులు కరణం భీమిరెడ్డి, విడపనకల్ మాజీ జెడ్పీటీసీ తిప్పయ్య, కమ్మ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ తేజోనాథ్, విడపనకల్ వైసిపి ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు ఉమాశంకర్, ఎంపిటిసి ఓబులేష్, మాజీ ఎంపీటీసీ ప్రసాద్, హంపయ్య, శివ, తదితరులు ఉన్నారు.

జాతీయ సాంకేతిక సదస్సు

అనంతపురం : అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 8వ జాతీయ సంకేతిక సదస్సును శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ అకాడమిక్ ప్లానింగ్ ప్రొఫెసర్ సురేష్‌బాబు మాట్లాడుతూ సిఎస్ఇ విద్యార్థులు ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ ఎం.అనంతరాముడు, వైస్ ఛైర్మన్ రమేష్‌నాయుడు, ప్రిన్సిపల్ రామమూర్తి, నైపుణ్యాభివృద్ధి సంచాలకులు సురేంద్రనాయుడు, సిఎస్ఇ విభాగాధిపతి మురళీధర్, విభాగ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రైయినేజీ పనులకు భూమిపూజ

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగరంలోని 14వ డివిజన్ పరిధిలో ఉన్న అమీన్ హోటల్ సమీపంలో రూ.27 లక్షలతో చేపడుతున్న సీసీ డ్రెయినేజీ పనులను మేయర్ మహమ్మద్ వసీం శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు తమ దృష్టికి తీసుకొచ్చిన సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ఇందులో భాగంగానే స్థానికుల విజ్ఞప్తి మేరకు సీసీ రోడ్డు పనులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు వాసంతి, కొగటం విజయ భాస్కర్‌రెడ్డి, కార్పొరేటర్లు అబూసాలేహా, కమల్‌భూషణ్, ఇఇ సూర్యనారాయణ, డిఇ సుబాష్, ఎఇ బాబావలి, తదితరులు పాల్గొన్నారు.

భూమిపూజ చేస్తున్న మేయర్ వసీం

చోరీల నియంత్రణపై అవగాహన

పుట్లూరు : మండలంలో వరుస చోరీలు జరుగుతున్న నేపథ్యంలో మండలంలోని పలు గ్రామాల్లో ఎస్ఐ దిలీప్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ఇందులో భాగంగా కందికాపుల, కడవకల్లు, ఓబుళాపురం, మడ్డిపల్లి గ్రామాల్లో పర్యటించి చోరీలపై ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. గ్రామాల్లో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అలాగే సైబర్ క్రైం..1930 గురించి, మట్కా, గ్యాంబ్లింగ్ వంటి అశాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీసులు, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

క్షయ బాధితులకు పౌష్టికాహారం పంపిణీ

నార్పల : మండల పరిధిలోని పప్పూరు ప్రాథమిక వైద్యశాల పరిధిలోని పలువురు క్షయ రోగులకు శుక్రవారం వైద్యశాల ఆవరణలో డాక్టర్ రవిశంకర్ ఆధ్వర్యంలో పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఒక్కొక్కరికి రాగి మాల్ట్ మూడు కిలోలు, వేరుశనగ విత్తనాలు కిలో, కందిపప్పు ఐదు కిలోలు, మంచినూనె ప్యాకెట్ అందజేశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ఎన్ విజయమ్మ, ఎంపీహెచ్ఈఓ మల్లికార్జున, ఎంపీహెచ్ఎస్ శ్రీరాములు, ఎంపీహెచ్ఏ శివ, క్షయాధికారిణి ఉమామహేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

పేదలందరికీ మెరుగైన వైద్యం

అనంతపురంసిటీ : రాష్ట్రంలోని పేద ప్రజలందరికీ మెరుగైన వైద్యం అందించాలన్న ఉద్దేశంతోనే సిఎం జగన్ ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని తీసుకొచ్చారని రుద్రంపేట సర్పంచి సుగాలి పద్మావతి ఆదినారాయణనాయక్, కార్యదర్శి హిదయతుల్లా తెలిపారు. శుక్రవారం అనంత రూరల్ మండలం రుద్రంపేట సచివాలయం–2లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా 687 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి మనోజ్, జడ్పిటిసి చంద్రకుమార్, ఎంపిపి మహబూబ్‌బిసాదిక్, వార్డు సభ్యులు శిరోమణి, సుధాకర్, నాయకులు నారాయణరెడ్డి, వెంకటరాముడు, నాగరాజు, వాలంటరీ శైలజ, నాగార్జున, పవన్, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

శస్త్రచికిత్స భవన సముదాయం ప్రారంభం

అనంతపురం : నగరంలోని పెద్దాసుపత్రిలో ఉన్న ప్రసూతి విభాగంలో నూతన శస్త్ర చికిత్స భవన సముదాయాన్ని ఎంపి తలారి రంగయ్య, జడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ మహమ్మద్‌వసీం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆసుపత్రుల్లో మౌలిక వసతులు కల్పించేందుకు సిఎం జగన్ అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఇందులో భాగంగానే శస్త్ర చికిత్స భవన సముదాయాన్ని నిర్మించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షులు పైలా నర్సింహయ్య, ప్రభుత్వ సర్వజన వైద్యశాల సుపరింటెండెంట్, వైద్యశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ తలారి రంగయ్య

నేరాలు ఘోరాలు

ఎటిఎం కార్డు ఏమార్చి నగదు అపహరణ

గుత్తి : పట్టణంలోని ఎపి గ్రామీణ ప్రగతి బ్యాంకు (ఎపిజిపిబి) వద్ద ఉన్న ఎటిఎం కేంద్రంలో శుక్రవారం ఓ మహిళ నుంచి ఏటీఎం కార్డు ఏమార్చి ఓ దుండగుడు నగదును అపహరించుకెళ్లాడు. పట్టణానికి చెందిన ఎస్తేరు రాణి డబ్బును డ్రా చేయడానికి ఎటిఎం కేంద్రానికి వెళ్లింది. తనకు డబ్బు డ్రా చేయడం తెలియకపోవడంతో ఇబ్బంది పడుతుండడం గ్రహించిన ఏటీఎం కార్డు దొంగ ఆ మహిళ నుంచి ఏటీఎం కార్డును తీసుకొని డబ్బులు డ్రా చేస్తున్నట్లు నటించి ఆ కార్డును ఉంచుకొని తన వద్ద ఉన్న మరో ఏటీఎం కార్డును ఇచ్చి అక్కడ నుంచి ఉడాయించాడు. మరోచోట డబ్బును డ్రా చేసుకున్నాడు. కొంతసేపటికి ఆమెకు ఎటిఎం కార్డుకు సంబంధించి రూ.25వేలు డ్రా చేసినట్లు మెసేజ్ రావడంతో లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించింది.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గుత్తి : పట్టణంలోని కోళ్లఫారం సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికీ తీవ్రగాయాలయ్యాయి. మండలంలోని ఉబిచెర్ల గ్రామానికి చెందిన ధనంజయ, రామకష్ణ లు ద్విచక్రవాహనంలో వస్తుండగా కోళ్లఫారం వద్ద ఆటో ఢీకొంది. తీవ్రంగా గాయపడ్డ ధనంజయ, రామకృష్ణను చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రి తరలించారు. వైద్యుల సూచన మేరకు ధనుంజయను కర్నూలు ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కంబదూరు విద్యార్థినులు

ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

కళ్యాణదుర్గం : రాష్ట్ర స్థాయి కాంగ్రెస్ ప్రాజెక్టుకు కంబదూరు మండల పరిధిలోని ములకనూరు గ్రామ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు పరమేశ్వరప్ప తెలిపారు. జిల్లాకేంద్రంలో నిర్వహించిన జాతీయ స్థాయి బాలల సైన్స్ కాంగ్రెస్–2023 పోటీల్లో పాఠశాలకు చెందిన మౌనిక, కల్పన కలిసి 'అనీమియా లక్షణాలు–పరిష్కార మార్గాలు' అన్న అంశంపై ప్రాజెక్టును తయారు చేశారన్నారు. ఈ పోటీల్లో 102 మంది ప్రాజెక్టులను వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ప్రదర్శించగా రాష్ట్రస్థాయికి ములకనూరు విద్యార్థులు ఎంపిక కావడం హర్షించదగ్గ విషయమన్నారు. ప్రాజెక్టుకు ఎంపికైన విద్యార్థినులను పాఠశాల సిబ్బంది విజయ్‌కుమార్, హనుమంతరెడ్డి, విద్యార్థుల తల్లితండ్రులు అభినందించారు.

ఉద్యోగాలకు గేట్స్ విద్యార్థుల ఎంపిక

గుత్తి : గేట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన క్యాంపస్ ఇంటర్వ్యూలో కళాశాలకు చెందిన పలువురు విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. బెంగళూరు చెందిన ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ (ఎక్స్ఎల్ ఆర్) ఆధ్వర్యంలో కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించారు. కంపెనీ ప్రతినిధుల నేతృత్వంలో జరిగిన ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో కళాశాలకు చెందిన ఇంజనీరింగ్, ఎంసీఏ విద్యార్థులకు రాత, మౌలిక పరీక్షలు జరిగాయి. అందులో 32 మంది విద్యార్థులు ఫుల్ స్టాక్ డెవలపర్, సెలీనియం టెస్టింగ్ ఇంజనీర్లుగా ఎంపిక చేశారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి రూ.4లక్షలు వార్షిక వేతనం ఇవ్వనున్నట్లు కంపెనీ ప్రతినిధులు తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన వారిని కళాశాల కరస్పాండెంట్ వీకే. పద్మావతమ్మ, డైరెక్టర్ వీకే.శ్రీవాణి, మేనేజింగ్ డైరెక్టర్ గజ్జల రఘునాథ్‌రెడ్డి అభినందించారు.

ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో గేట్స్ సిబ్బంది

హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

మాట్లాడుతున్న ఎంఇఒ రవినాయక్

గుత్తి : బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యతని మండల విద్యాధికారి బి.రవినాయక్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో శుక్రవారం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో బాలల హక్కుల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేజీబీవీ ప్రిన్సిపాల్ ఎం.రుద్రాక్షి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంఈఓ మాట్లాడుతూ బాలికలు, విద్యార్థినుల కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు తీసుకొచ్చిందన్నారు. ప్రస్తుత సమాజంలో బాలికలపై అఘాయిత్యాలు పెరిగిపోయాన్నారు. వాటిని అరికట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ ఎస్ఎం.అజాద్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఎం.నాగేశ్వరి, చైల్డ్‌లైన్ మాజీ కోఆర్డినేటర్ బాలాజీ, హెడ్‌కానిస్టేబుల్ హనుమంతు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి పంటనష్టం వివరాల సేకరణ

ఉరవకొండ : జిల్లా అధికారుల ఆదేశాలు మేరకు నేటి నుంచి వివిధ రకాల పంటలు సాగు చేసి నష్టపోయిన వివరాలను సేకరించనున్నట్లు ఉరవకొండ డివిజన్ ఎడిఎ పద్మజ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 28 కరువు మండలాలుగా ప్రకటించగా ఉరవకొండ డివిజన్ పరిధిలోని ఉరవకొండ, వజ్రకరూరు, విడపనకల్, గుంతకలు మండలాలు ఉన్నాయన్నారు. ఆయా మండలాల్లో సాగు చేసిన పంటలు వర్షాభావ కారణంగా 33 శాతం కంటే అధికంగా దెబ్బతిని ఉంటే పంట నష్టం అంచనా వేయనున్నట్లు తెలిపారు.

బాలల హక్కుల పరిరక్షణ సామాజిక బాధ్యత

అనంతపురం : బాలలహక్కుల పరిరక్షణను ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా గుర్తించాలని పలువురు వక్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. నల్లాని రాజేశ్వరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'బాలలహక్కులు–చట్టాలు–సామాజిక బాధ్యత' అనే అంశంపై శుక్రవారం సాయంత్రం అంతర్జాల సదస్సు నిర్వహించారు. ఈ వెబ్‌నార్‌కు సభాధ్యక్షులుగా ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ నల్లని రాజేశ్వరి వ్యవహరించారు. ముఖ్య అతిథులుగా ఆర్‌డిటి డైరెక్టర్ విశాల ఫెర్రర్, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరీక్షల విభాగం డీన్ గిడ్డి వెంకటరమణ హాజరై మాట్లాడారు.

ప్రతి హామీని అమలు చేస్తున్నాం : మేయర్

అనంతపురం కార్పొరేషన్ : ఎన్నికల ముందు సిఎం జగన్ ఇచ్చిన ప్రతి హామీని తప్పకుండా అమలు చేస్తున్నామని మేయర్ మహమ్మద్ వసీం తెలిపారు. శుక్రవారం నగరంలోని 42వ డివిజన్ పరిధిలో నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు విద్యుత్ స్తంభాలు మార్చాలని విన్నవించడంతో గురువారం 19 నూతన కరెంట్ పోల్స్ మంజూరు చేయించారు. దీంతో కరెంటు పోల్స్ ఏర్పాటు పనులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన మాట మేరకు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి రోడ్లు, డ్రెయినేజీలతోపాటు అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు రహంతుల్లా, సైపుల్లా, అనిల్‌కుమార్, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అశ్వర్థ నారాయణస్వామి ఉత్సవాల పోస్టర్లు విడుదల

పెద్దపప్పూరు : మండలంలో వెలసిన అశ్వర్థంలో వెలసిన నారాయణస్వామి, శ్రీచక్ర భీమలింగేశ్వర స్వామి దేవస్థానం ఉత్సవాల పోస్టర్లను ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. ఈనెల 23వ తేదీ నుంచి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇఒ సుబ్రమణ్యం, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


అశ్వర్థ నారాయణస్వామి ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పెద్దారెడ్డి

19న గుడికట్ల సంబరాలు

కురుబ సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు

విలేకరులతో మాట్లాడుతున్న కురుబ సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు

ప్రజాశక్తి-అనంతపురం

కనీవిని ఎరుగని రీతిలో ఈనెల 19న ఆదివారం అనంతపురంలో నిర్వహించనున్న గుడికట్ల సంబరాలను విజయవంతం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు తెలిపారు. ఈమేరకు శుక్రవారం నగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దాదాపు 8 సంవత్సరాల క్రితం కురుబల ఉనికిని చాటే గుడికట్ల సంబరాలు తిరిగి ప్రజలకు తెలియజేయడంతోపాటు కురుబల ఐక్యతను మరింత పటిష్టం చేసేలా ఉత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. దాదాపు 252 గుడికట్లను నగరంలో ఊరేగించనున్నట్లు తెలిపారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఉత్సవాలకు తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక, తమిళనాడు, దేశంలోని పలు ప్రాంతాల నుంచి కురుబలు హాజరుకానున్నట్లు తెలిపారు. కావున జిల్లాలోని కురుబలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కురుబ సంఘం గౌరవాధ్యక్షులు నారాయణ, ట్రెజరర్ నాగన్న, కళ్యాణ మండపం ప్రతినిధి కొనకొండ్ల రాజేష్ లక్ష్మి, పిడుగు కృష్ణమూర్తి, కురుబ సంఘం నేతలు, తదితరులు పాల్గొన్నారు.

బెలుగుప్ప: ఈనెల 19న ఆదివారం అనంతపురం ఆర్ట్స్ కళాశాల మైదానంలో నిర్వహించనున్న కురుబల గుడికట్ల సంబరాలను జయప్రదం చేయాలని కురుబ సంఘం మండల అధ్యక్షులు కరుణాకర్, జిల్లా కార్యదర్శి మహేష్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంతోపాటు తగ్గుపర్తి, గంగవరం, కాలువపల్లి, హనుమిరెడ్డిపల్లి, యలగలవంక, విరుపాపల్లి, ఆవులన్న, బుదివర్తి గ్రామాల్లో కురుబలను కలిసి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కురుబ సంఘం కార్యదర్శి మహేష్, మండల అధ్యక్షుడు కర్ణాకర్, గౌరవ అధ్యక్షులు ఎస్కే మల్లికార్జున, ఉపాధ్యక్షులు గోపాల్ బ్రహ్మయ్య, రాజగోపాల్ కార్యవర్గ సభ్యులు జయశంకర్, ఏర్రిస్వామి , కురుబ కులస్తులు పాల్గొన్నారు

గ్రాద్దదిన్నెలో పోస్టర్లను విడుదల చేస్తున్న కురుబలు

నిధులు, నికరజలాలే లక్ష్యంగా పోరు..

తాడిపత్రి : కరువు నివారణ సహాయ చర్యల్లో భాగంగా నిధులు, నికరజలాలే లక్ష్యంగా పోరు చేసేందుకు కదులుదామని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు టి.రంగయ్య పిలుపునిచ్చారు. వివిధ సమస్యల పరిష్కారానికి ఈనెల 20, 21 తేదీల్లో విజయవాడలో నిర్వహించనున్న నిరసన దీక్షకు సంబంధించిన గోడపత్రికలను శుక్రవారం పట్టణంలో విడుదల చేశారు. ఈకార్యక్రమంలో వ్య.కా.సం నియోజకవర్గ అధ్యక్షుడు నారాయణరెడ్డి, కార్యదర్శి వి.టి.రామాంజినేయులు, సిపిఐ మండల కార్యదర్శి ఎ.నాగరంగయ్య, నాయకులు వడ్ల బాణాల కృష్ణమాచారి, ఎర్రప్ప, లక్ష్మీనారాయణ, వెంకటయ్య, కార్మికులు సురేష్, రామాంజి, తదితరులు పాల్గొన్నారు.

వైసిపికి చరమగీతం పాడుదాం

మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం చేస్తున్న అరాచక పాలనకు చరమగీతం పాడుదామని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్‌చౌదరి, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు టిసి.వరుణ్ పిలుపునిచ్చారు. శుక్రవారం నగర సమీపంలోని నారాయణపురంలో జనసేన, టిడిపి సంయుక్తంగా బాబు షూరిటీ భవిష్యత్తుకి గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి టిడిపి తోనే సాధ్యమని, అందుకు జనసేన కూడా కలిసివస్తోందన్నారు. రాబోయేది టిడిపి, జనసేన సంయుక్త ప్రభుత్వమే అన్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్ నియోజకవర్గ టిడిపి పరిశీలకులు రమణారెడ్డి, నగర అధ్యక్షుడు మారుతీకుమార్‌గౌడ్, రాష్ట్ర నాయకులు తలారి ఆదినారాయణ, దేవళ్ల మురళి, జిల్లా ఉపాధ్యక్షులు డిష్.నాగరాజు, సరిపూటి రమణ, నటేష్ చౌదరి, నారాయణస్వామి యాదవ్, రాయల్ రఘు, పోతుల లక్ష్మీనరసింహులు, సురేంద్ర, వన్నురప్ప, విజయ్ శ్రీరెడ్డి, సరళ, సంఘ తేజస్విని, కృష్ణవేణి, వసుంధర తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలికి కరపత్రం అందజేస్తున్న టిడిపి, జనసేన నాయకులు

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

'గడప గడపకూ'లో నాయకులు

ప్రజాశక్తి-ఉరవకొండ

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పాలన సాగిస్తోందని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. శుక్రవారం వజ్రకరూరు మండలం కొనకొండ్ల సచివాలయం-2లో పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా మారెమ్మ అవ్వ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వం పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా అనేక ప్రజా సమస్యలు పరిష్కారం అవుతున్నాయన్నారు. ప్రజా సంక్షేమాన్ని కాంక్షించే సిఎం జగన్ సంక్షేమ పథకాలన్నీ లబ్ధిదారుల ఖాతాలకే నేరుగా చేరవేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రమావత్‌దేవి, వైస్ ఎంపిపి సుంకమ్మ, ఎంపిడిఓ విజయలలిత, వైసిపి మండల కన్వీనర్ సోమశేఖర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ సుశీలమ్మ, జెసిఎస్ కన్వీనర్ ఉస్మాన్, వెంకటరెడ్డి, సెక్రటరీ శ్రీధర్, ఎంఎల్‌ఓ తేజేశ్వర్‌రెడ్డి, కొనకొండ్ల

మహిళకు కరపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

నాయకులు దాసరి గోవిందు, చాకలి సంజప్ప, కిష్టప్ప, బోయ గోవిందు, చైతన్య, లింగరాజు, రంగనాథ్, శివశంకర, మండల నాయకులు రాకెట్ల బాబు, కిష్టప్ప, చంద్రానాయక్, వీరా, కిష్టప్ప, రమేష్, అర్జున్, సర్పంచులు సురేంద్ర, కమలమ్మ, శివాజీనాయక్, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలికి కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే పెద్దారెడ్డి తనయుడు హర్షవర్ధన్‌రెడ్డి

తాడిపత్రి : జగనన్న పాలనతోనే రాష్ట్ర ప్రజలకు సంపూర్ణ సంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యే పెద్దారెడ్డి తనయుడు కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణ పరిధిలోని 18వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వం పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంక్షేమ పాలన కొనసాగాలంటే జగన్‌ను మళ్లీ సిఎంను చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు జావిద్, నాయకులు ఆకుల నాగిరెడ్డి బ్రదర్స్, అయాబ్, కార్యకర్తలు. తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల సేవలు అభినందనీయం

అహుడా ఛైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, ప్రజలకు చైతన్యం పెంపొందించడంలో గ్రంథాలయాల సేవలు అభినందనీయమని అహుడా ఛైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో 56వ గ్రంథాలయ వారోత్సవాల భాగంగా నాల్గవ రోజు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ ఎల్‌ఎం.ఉమా మోహన్‌రెడ్డి, కార్యదర్శి పి. రమ ఆధ్వర్యంలో 'కవి సమ్మేళనం' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యాదవ్ కార్పొరేషన్ ఛైర్మన్ హరీష్‌యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షులు ఎల్‌ఎం.మోహన్‌రెడ్డి, డిప్యూటీ లైబ్రేరియన్ వి.సుబ్బరత్నమ్మ సిబ్బంది, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

నార్పల : 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గ్రంథాలయ అధికారి జీవన ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక గ్రంథాలయంలో కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ పాత్రికేయులు ఆసాది లక్ష్మీనారాయణ విద్యార్థులకు పలు కవితలను వినిపించారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి గ్రంథాలయానికి వెళ్లడం అనేది అలవాటు చేసుకోవాలన్నారు. గ్రంథాలయం అనేది విజ్ఞాన భాండాగారం అన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి నారపరెడ్డి బాలల పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుని నసీమా, గ్రంథాలయ అధికారిణి జీవన, రిటైర్డ్ కండక్టర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అనంతపురంలో మాట్లాడుతున్న అహుడా ఛైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్

ఉరవకొండలో విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్న అధ్యాపకులు

ఉరవకొండ : 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా 4వ రోజు ఉరవకొండలో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విద్యార్థుల్లో పోటీతత్వం మొదలైన అంశాలు అభివృద్ధి చేసే నిమిత్తం పోటీ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. గెలుపొందిన విద్యార్థులకు గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా నవంబర్ 20న బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి వై.ప్రతాపరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

కాలవ... అసత్య ఆరోపణలు మానుకో.. : వైసిపి

రాయదుర్గం రూరల్ : మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు అసత్య ఆరోపణలు మానుకోవాలని వైసిపి నాయకులు బోరేవెల్ నాగిరెడ్డి సూచించారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని 74 ఉడేగోళం సర్వే నెంబర్ 77లో స్థలాన్ని కబ్జా చేశారని ఆరోపించడం బాధాకరమన్నారు. సంబంధిత స్థలంలో మెమోరియల్ భవనం నిర్మిస్తుంటే కాలవకు కడుపు మంటగా ఉందన్నారు. ఇప్పటికైనా కాలవ నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని, లేనిపక్షంలో తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. ఈ సమావేశంలో సర్పంచులు వెంకటేశులు, విశ్వనాథరెడ్డి, ఎంపిటిసి అరుణ్‌కుమార్, నాయకులు మెచ్చిరి చంద్ర, నారాయణనాయక్, భీమప్ప, శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వైసిపి నాయకులు బోరేవెల్ నాగిరెడ్డి